క్లుప్తంగా

ఓడబలిజ సంఘం కమిటీ ఎన్నిక



వాజేడు: మండలంలోని జగన్నాథపురం ఓడ బలిజ సేవా సంఘం గ్రామ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్, ఉపాధ్యక్షుడు రమణయ్య సమక్షంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రొద్ద అశోక్, కార్యదర్శిగా కుప్ప సురేష్, కోశాధికారిగా సుగంధపు లీలాప్రసాద్, సలహాదారుడిగా బద్ది శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పానెం మూర్తి, అధికార ప్రతినిధిగా బొల్లె కామేశ్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రొద్ద డ్యానీలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గార నాగార్జున రావు, తోట మల్లికార్జున రావు, రఘుపతిరావు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి దేవాలయ కమిటీ..



వెంకటకృష్ణ, అధ్యక్షుడు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పోచమ్మతల్లి దేవాలయం నూతన కమిటీని శనివారం గ్రామస్తులు అందరూ కలిసి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలడుగు వెంకటకృష్ణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వేమునూరి నాగాచారి, పెండెం హేమాద్రి, కార్యదర్శిగా జెట్టి శోభన్, సహాయ కార్యదర్శిగా రేగుల లక్ష్మణ్, కోశాధికారిగా ఏడాకుల చంద్రశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి గుండెబోయిన పోషాలు, సలహాదారులుగా జెట్టి సోమయ్య, ఆలూరి శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేద్దాం

ఏటూరునాగారం: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశం పట్ల మనకున్న గౌరవాన్ని చాటుకుదాం అని ములుగు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను పురస్కరించుకొని ములుగు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాను విక్రయించనున్నట్లు, ధర కేవలం రూ. 25 మాత్రమే అన్నారు. ఆన్‌లైన్‌లో కూడా మా సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అందరూ సమీపంలోని పోస్టల్ కార్యాలయంలో జాతీయ జెండాను తీసుకోవాలని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో అసువులు బాసిన హిందువులకు నివాళి



ఏటూరునాగారం : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన మారణహోమంలో అసువులు బాసిన హిందువులకు నివాళులర్పిస్తూ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి బస్టాండ్ నుంచి బొడ్రాయి వరకు స్థానిక నాయకులు, యువకులు, వ్యాపారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందువులపై దాడులు ఖండించాలని నినాదాలు చేశారు. దేశంలోని హిందువులు ఏకం కావాలని చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కత్తెర శ్రీనివాస్, మాధవ్, అర్జున్‌సింగ్, గంజి రమేష్, కుదురుపాక రాజేష్, ప్రవీణ్, మండల రామకృష్ణ, అర్చకులు యల్ల ప్రగడ సూర్యనారాయణ శర్మ, చిదురాల వాసు, అలువాల శ్రీనివాస్, గుంత రమేష్, రాజేష్, జనార్దన్, ప్రవీణ్, గార మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న వారిపై కేసు



వాజేడు : గుడుంబా విక్రయిస్తున్న ఐదుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఇళ్లల్లో సోదాలు చేసినట్లు ఆయన తెలిపారు. సోదాల్లో చెన్నం నర్సయ్య, కుర్సం పద్మ, కుర్సం సీత, మడప తులసి, కుర్సం మణెమ్మ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 55 లీటర్ల గుడుంబా లభించడంతో స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుడుంబా, గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నిఘా నీడలో గ్రామాలు

- పలుచోట్ల సీసీ కెమెరాలు ప్రారంభం
- ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు



తాడ్వాయిలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని పలు గ్రామాలను నిఘా నీడలోకి తెచ్చేలా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల నుంచి గ్రామీణ రోడ్ల వరకు ఎక్కడికక్కడ సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంపై గ్రామాల్లోని ప్రజల భాగస్వామ్యంతో స్థానిక పోలీసులు దృష్టి సారించారు. గత కొద్ది రోజుల నుంచి మేము సైతం కింద ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గ్రామాల్లోని ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలు, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేందుకు ప్రజల్లో చైతన్య తీసుకొచ్చారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు..

మండలంలోని గ్రామాలు నిఘానేత్రాల నీడన ఉండనున్నాయి. మండల కేంద్రంలో ఐదు సీసీ కెమెరాలు. కాటాపూర్‌లో ఐదు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండలంలో 18 గ్రామపంచాయతీల్లో అత్యంత మూరుమూల అటవీ ప్రాంతంలోని బందాల, లింగాల గ్రామపంచాయతీలు మినహా 16 జీపీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక భూమిక పోషించనున్నాయి. సాక్ష్యాధారాల సేకరణ, నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషిస్తాయని పోలీసులు తెలిపారు. పోలీసుల అవగాహన కార్యక్రమాలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామాల్లోని ప్రజలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. దీంతో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమవుతుంది. రెండేళ్లపాటు నిఘానేత్రాలు నిరంతరం పని చేసేలా టెక్నీషియన్‌తో ఒప్పందం చేసుకుని ఆధునిక టెక్నాలజీ కలిగిన కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట పడనుంది. మండలంలోని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఎస్సై సిబ్బందితో కలిసి ప్రజలను భాగస్వాములను చేశారు.



కాటాపూర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న టెక్నీషియన్

ప్రజలందరి సహకారంతో..



ప్రజలందరి సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి. మండల వ్యాప్తంగా 18 జీపీల్లో 16 గ్రామపంచాయతీల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలోనే సీసీ కెమెరాల ఏర్పాటులో మొదటి మండలంగా నిలపాలని లక్ష్యం పెట్టుకున్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై తాడ్వాయి

బాధిత కుటుంబాలకు పరామర్శ



వాణి రెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు

మంగపేట: మండలంలోని కమలాపురంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి శనివారం పరామర్శించారు. కమలాపురం గ్రామానికి చెందిన ఇనుముల జనార్దన్ రెడ్డి–సుమతరెడ్డి దంపతుల కుమార్తె భవానిరెడ్డి(సిరి) ఈనెల 31న హనుమకొండలోని వైబ్రెంట్ అకాడమీలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శనివారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో వారు హాజరై మృతురాలి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మండల రవీందర్ భార్య రమ ఇటీవల మృతి చెందగా శనివారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై మృతురాలి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారివెంట మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ శిద్ధశెట్టి లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్, పట్బోజు సత్యనారాయణ, వట్టి కృష్ణారెడ్డి, పగడాల వెంకట్‌రెడ్డి, ఇస్సాబోయిన సాంబయ్య, ఆకుల ప్రభాకర్, కోరుకొప్పుల రాంబాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పూజారి సతీష్, తదితరులు ఉన్నారు.

19న చారిటబుల్ జంపన్న ట్రస్ట్ ప్రారంభం



ములుగు : ఈనెల 19న జిల్లా కేంద్రంలో జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించనున్నట్లు ఫౌండర్ భూక్య జంపన్న శనివారం తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, డాక్టర్ పోరిక రవీందర్, ఎస్సై వెంకటేశ్వరావు, బాలాజీలకు జంపన్న అందజేశారు. ఆయన వెంట చంటి పాడియా, విక్రమ్‌యాదవ్, జితేందర్, రవి, వీరబోయిన రాజేందర్, రాజు గంగపుత్ర, పవన్, తిరుపతి, ధరావత్ శేఖర్ ఉన్నారు.

ముగ్గురి అరెస్టు

మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన మూడెత్తుల శ్రీలత శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు ఆత్మహత్యకు శ్రీలత భర్త సమ్మయ్యతో పాటు మూడెత్తుల పద్మ, మూడెత్తుల కల్యాణ్ అలియాస్ పవన్ వేధింపులే కారణమని మృతురాలి తల్లి జునువాల పద్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై మహేందర్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ముగ్గురిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిరుపేదకు అండగా 'సహాయ నిధి' టీం



రమేశ్‌కు ఆర్థికసాయం చేస్తున్న సహాయ నిధి బృంద సభ్యులు

కన్నాయిగూడెం: రెక్కాడితే డొక్కాడని కుటుంబానికి ఆరోగ్య సమస్య రావడంతో ముప్పనపల్లి సహాయనిధి టీం సభ్యులు ఆర్థిక సాయం చేసి బాసటగా నిలిశారు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దేపాక రమేశ్ కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవన సాగిస్తున్నాడు. ఇటీవల అతడికి తీవ్రమైన కడుపు నొప్పిరావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యుల సూచనల మేరకు పరీక్షలు నిర్వహించగా అతడికి 24 గంటల నొప్పి అని పరీక్షల్లో తేలడంతో వెంటనే ఆపరేషన్ చేయాలని తెలుపగా దానికి సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేక వారు సమాచారాన్ని వాట్సప్ గ్రూపులో ఆదుకోవాలని కోరగా ముప్పనపల్లి సహాయనిధి టీమ్ సభ్యులు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. వారి వెంట ఎండీ.ఫైజొద్దీన్, మల్లేష్, సాయి పాల్గొని బాధితునికి ఆర్థిక సాయం అందించారు.

కార్పొరేట్‌కు అప్పగించడం సరికాదు



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మహాముత్తారం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం సరికాదని రైతు సంఘం నాయకులు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ బడ్జెట్ రైతులకు అనుకూలంగా సవరించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని నిలిపివేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, తెలంగాణ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు మల్లయ్య, రైతుసంఘం మహిళా నాయకురాళ్లు సుగుణ, స్వప్న, గున్నక్క తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లిలో నిత్యావసర సరుకులు, కూరగాయలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన వారాంతపు సంతను ఎస్సై అశోక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరం కోసం మొట్లపల్లిలో సంత నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ అభివృద్ధి చెందాలని కోరారు. సంతలో అన్ని రకాల సరుకులకు ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నరహరి బక్కిరెడ్డి, గూడూరి రఘుపతిరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ

మల్హర్: మండలంలోని కొండపేట శివారు కుంభంపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయినేజీలో చెత్తాచెదారం చేరడం వలన వర్షాలు కురిసిన సమయంలో మురుగు నీరు ఇళ్ల పక్క నుంచి పారుతోందని గ్రామస్తులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేసి, నీరు నిల్వ లేకుండా చర్య తీసుకోవాలని కోరుతున్నారు.



కూరుకుపోయిన సైడ్ కాల్వ

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని స్థానిక ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండలంలోని తుపాకులగూడెంలో యువతకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం వాలీబాల్ క్రీడలు ప్రారంభించామన్నారు. వివిధ గ్రామాల నుంచి ఎనిమిది టీంలు పోటీపడ్డాయన్నారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగనున్నట్లు వారు వెల్లడించారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాల వైపు మొగ్గు చూపొద్దని సూచించారు. మత్తుపదార్థాలకు బానిసై నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

కొత్త వ్యక్తులు గ్రామాలకు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని స్థానిక ఎస్సై వెంకటేశ్ అన్నారు. శనివారం ఉదయం మండలంలోని పాలాయిగూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోకి వేకువజామున చేరుకొని ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ ప్రధానకూడలి వద్ద ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో కొత్తవ్యక్తులకు ఆశ్రయం ఇచ్చినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చి జీవితాలను సమస్యల్లో నెట్టకోవద్దని వారికి సూచించారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఫ్ పోలీసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండలంలోని మంగవాయి, సీతారాంపురం, చినగంగారం, ముత్తారం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తుల వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, ఆశిష్, వినయ్, సత్యనారాయణ, వైద్య సిబ్బంది యాకలక్ష్మి, కోటిరెడ్డి, భూపతి, మోహన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘురామ్

వెంకటాపురం(కె): భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అట్లూరి రఘురామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతు రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో ఉంచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోని తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాధనపల్లి విజయ్‌కుమార్, తోట సతీష్, సంకా హేమ సుందర్, శేఖర్, కుంజ నరేంద్ర, రాజు, లక్ష్మిపతి, కోగిల శ్రీను, మాటూరి ముత్తయ్య, నోముల కిషన్ ఉన్నారు.

ప్రమాద బీమా ప్రతి ఒక్కరికీ అవసరం

కాటారం: వ్యక్తిగత ప్రమాద బీమా ప్రతి ఒక్కరికీ అవసరమని స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొట్టె సతీశ్ అన్నారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణులకు అవగాహన కల్పించి తపాలా శాఖ ద్వారా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు బహూకరించారు. సేవా సంస్థ ద్వారా పాలసీ డబ్బులు చెల్లించారు. ఈ సందర్భంగా కొట్టె సతీశ్ మాట్లాడుతూ.. ప్రమాదం అనేది అనుకోకుండా సంభవించే విషాద సంఘటన అన్నారు. ఆ సమయంలో బీమా కుటుంబానికి భరోసా కల్పిస్తుందని వివరించారు. పాలసీలు బహూకరించిన సతీశ్‌ను నాయీ బ్రాహ్మణులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాటారం పోస్టాఫీస్ బ్రాంచ్ మాస్టర్లు మహమ్మద్ జానీ, మెహతాబ్, మధు, అంజలి, స్వప్న, హరీశ్, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

టేకుమట్ల: ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలవేని రాజేందర్, ఉపాధ్యక్షుడిగా పుప్పాల రాజు, ప్రధాన కార్యదర్శిగా కండెం రవీందర్, కోశాధికారిగా మధుకర్, ముఖ్య సలహాదారులుగా కొడగాని మహేందర్, గౌరవ అధ్యక్షులుగా రామారావు, రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా సదానందం, నవీన్, సంపత్, రమేష్, రాజేందర్, సరోత్తం, శ్రీకాంత్, విజేందర్, విజయ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాల్

- జీఓ ఇచ్చి నిధులు ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం
- నాలుగేళ్లుగా నిలిచిన పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలి



నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవనం

ఏటూరునాగారం: మండల కేంద్రంలో జీసీసీ గోదాం వెనుక ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం గత కొన్నేళ్ల నుంచి అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల క్రితం రూ.25 లక్షలతో నిర్మించాలని జీఓ మాత్రమే ఇచ్చారు కానీ ప్రొసీడింగ్ ఇవ్వలేదు. పంచాయతీరాజ్‌శాఖ, ఇంజనీరింగ్ అధికారులు తొందరపాటు తనంలో కాంట్రాక్టర్లను ఒత్తిడి చేయించి ఈ పనులను మొదలు పెట్టించారు. దీంతో దళిత కమ్యూనిటీహాల్ భవనానికి శంకుస్థాపన చేసి స్లాబ్ వరకు పూర్తి చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది. దళిత కుటుంబాలు వారి కుటుంబ సభ్యులు శుభకార్యాలకు, ఇతర సమావేశాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా ప్లాన్‌తో నిర్మించారు. పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై ఎలాంటి పట్టింపు లేని తనం ఉండడంతో పనులు ముందుకు సాగడం లేదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ మాత్రమే ఇచ్చిందని, ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడం, నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ముందుగా పెట్టుబడి పెట్టి రూ. 13లక్షల వరకు ఖర్చు చేసి పనులు చేయించాడు. కానీ ఆ పనులకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో ఆ డబ్బులు సైతం కాంట్రాక్టర్‌కు రాకపోవడంతో మిగతా పనులు కూడా చేయలేకపోతున్నాడు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అసంపూర్తిగా ఉన్న భవనాలపై దృష్టి సారించి కొంత మేర నిధులు కేటాయిస్తే ఈ భవనాలు దళితులకు ఉపయోగ పడేవిధంగా మారుకునే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి నిధులు చెల్లించి పనులు ముందుకు సాగేలా చూడాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



కృష్ణారావు మృతదేహం

ఎస్ఎస్‌తాడ్వాయి: పొలంలో దమ్ము చేస్తుండగా ప్రమాదవశాత్తు డ్రైవర్ ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని జంపగాయి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన గొంది కృష్ణారావు (45) కొత్తూరుకు చెందిన కడారి మల్లారెడ్డి ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో పొలంలో దమ్ముచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వీల్స్ కిందపడి కొద్ది దూరం ట్రాక్టర్ పొలంలో దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.